# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 04-02-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ వికసిత్ భారత్ సాధించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఉద్ఘాటించారు.
- ❖ దేశంలో స్టార్ట్ అప్ ల సంఖ్య గణనీయంగా పెరిగిందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద తెలిపారు.
- ❖ ఢిల్లీ అసెంబ్లీకి రేపు ఎన్నికలు జరగనున్నాయి.
- ❖ మొబైల్, ఎలక్ట్రానిక్స్ పరికరాల తయారీలో భారత దేశం గణనీయమైన పురోగతి సాధించిందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐ.టి. శాఖల మంత్రి అశ్విన్ వైష్ణవ్ పేర్కొన్నారు.
- ❖ ప్రపంచ సమస్యల పరిష్కారానికి భారత్ - బెల్జియం దేశాలు కలిసి పని చేయాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆకాంక్షించారు.

========================

"వికసిత్ భారత్" సాధించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఉద్ఘాటించారు. దేశంలో మధ్య తరగతి ప్రజల ఆకాంక్షలను ప్రభుత్వం నెరవేరుస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై లోక్ సభలో ఈ రోజు చర్చ జరిగిన సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ... గత పదేళ్ళలో కేంద్ర ప్రభుత్వం 25 కోట్ల మంది ప్రజలను పేదరికం నుండి బయటకు తీసుకువచ్చిందని తెలిపారు. దేశ వ్యాప్తంగా మారుమూల ప్రాంతాలకు సైతం ప్రతి ఇంటికీ మంచి నీరు సమకూర్చే అంశంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించిందని చెప్పారు. పేదల కోసం దేశ వ్యాప్తంగా 12 కోట్లకు పైగా సౌచాలయాలు నిర్మించామని, ఎన్.డి.ఎ. ప్రభుత్వ హయాంలో ప్రతి రూపాయిని ప్రజల కోసమే ఖర్చు చేస్తున్నామని అన్నారు. ప్రపంచ గేమింగ్ రాజధానిగా భారత్ రూపుదిద్దుకుంటోందని ప్రధానమంత్రి వివరిస్తూ....

(వాయిస్ 45 సెకన్లు)

=======================

దేశంలో అంకుర పరిశ్రమల సంఖ్య గణనీయంగా పెరిగిందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద తెలిపారు. లోక్ సభలో ఒక లిఖిత పూర్వక సమాధానంలో ఈ రోజు ఆయన ఈ విషయం తెలియజేస్తూ.... గత సంవత్సరం చివరి నాటికి పరిశ్రమ, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం... D P I I T... గుర్తించిన స్టార్ట్ అప్ ల సంఖ్య లక్షా యాభై వేలకు పైగా పెరిగిందని చెప్పారు. 2016వ సంవత్సరంలో స్టార్ట్ అప్ ఇండియా ప్రారంభ మైనప్పటి నుండి ప్రభుత్వం దీనిని సమర్ధవంతంగా అమలు చేయడానికి అనేక చర్యలు తీసుకుంటోందని జితిన్ ప్రసాద వివరించారు.

=======================

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు రేపు పోలింగ్ జరగనున్నది. మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు జరుగుతున్న ఈ ఎన్నికలలో ఒక కోటి 55 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. కాగా... ఈ నెల 8వ తేదీన ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఈ ఎన్నికల ప్రక్రియ ఈ నెల 10వ తేదీతో ముగుస్తుంది. మొత్తం 699 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు.

=======================

మొబైల్, ఎలక్ట్రానిక్స్ పరికరాల తయారీలో భారత దేశం గత పదేళ్లలో గణనీయమైన పురోగతి సాధించిందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐ.టి. శాఖల మంత్రి అశ్విన్ వైష్ణవ్ తెలిపారు. 2014 సంవత్సరంలో కేవలం రెండు మొబైల్ తయారీ యూనిట్లు మాత్రమే ఉన్నాయని, దేశ వ్యాప్తంగా ఇప్పుడు ఆ సంఖ్య 300 యూనిట్లకు చేరుకుందని సామాజిక మాధ్యమంలో ఆయన పేర్కొన్నారు. మొబైల్ ఫోన్ తయారీ విలువ 2014 ఆర్థిక సంవత్సరంలో 18 వేల 9 వందల కోట్ల రూపాయల నుండి 2024 ఆర్థిక సంవత్సరం నాటికి 4 లక్షల 22 వేల కోట్ల రూపాయలకు పెరిగిందని అన్నారు. ఎగుమతులు కూడా లక్షా 29 వేల కోట్ల రూపాయలు దాటాయని ఆయన తెలిపారు. గత దశాబ్ద కాలంగా మొబైల్ ఫోన్ తయారీ వల్ల 12 లక్షల ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలను సృష్టించామని, భారత్ లో వస్తు తయారీ ద్వారా స్వావలంబన సాధిస్తున్నామని అశ్విన్ వైష్ణవ్ వివరించారు.

=======================

బెల్జియం దేశ కొత్త ప్రధాన మంత్రిగా బార్ట్ డి వేవర్ ప్రమాణ స్వీకారం చేశారు. ఆ దేశ రాయల్ భవంతిలో బెల్జియం రాజు ఫిలిప్ సమక్షంలో ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. 5 పార్టీలతో కూడిన డి వేవర్ సంకీర్ణ ప్రభుత్వంలో ఏడుగురు ఫ్రాంకోఫోన్ మంత్రులు, ఏడుగురు ఫ్లెమిష్ మంత్రులు ఉన్నారు.

విరామం

=======================

బెల్జియం దేశ కొత్త ప్రధాన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన బార్ట్ డి వేవర్ కు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా అభినందనలు తెలిపారు. ప్రపంచ సమస్యలపై పరస్పర సహకారం పెంపొందించుకోవడానికీ, భారత్ - బెల్జియం సంబంధాలను మరింత బలపరచుకోవడానికి ఇరు దేశాలు కలిసి పని చేయాలని బార్ట్ డి వేవర్ కు పంపిన శుభాకాంక్షల సందేశంలో నరేంద్ర మోడీ పేర్కొన్నారు.

=======================

భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ IIC-బ్రూగెల్ వార్షిక సెమినార్‌లో ప్రసంగించారు, అక్కడ ఆయన ప్రపంచ రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థ, భారతదేశ విదేశాంగ విధానంపై ముఖ్యమైన అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ

సెమినార్‌లో భారతదేశం, పెరుగుతున్న అంతర్జాతీయ పాత్ర, ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనే మార్గాలు భారత దౌత్యం కొత్త దిశపై కేంద్రమంత్రి తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

(వాయిస్ 40 సెకన్లు)

========================

"ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన" కింద దేశంలో ఒక కోటి 72 లక్షల రూపాయల మేర రైతుల సమస్యలను పరిష్కరించామని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. లోక్ సభలో ఒక లిఖిత పూర్వక సమాధానంలో ఆయన ఈ విషయం తెలియజేస్తూ.... ఈ పథకం ప్రారంభమైనప్పటి నుండి గత సంవత్సరం వరకు రైతుల నుండి దాదాపు 32 వేల కోట్ల రూపాయల మొత్తాన్ని ప్రీమియంగా వసూలు చేశామని పేర్కొన్నారు.

========================

భారత దేశం - బంగ్లా దేశ సరిహద్దులలో మొత్తం 4 వేల 96 కిలో మీటర్ల పొడవునా 3 వేల 232 కిలో మీటర్లకు పైగా కంచె నిర్మాణం జరిగిందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ తెలిపారు. లోక్ సభలో ఈ రోజు ఒక లిఖిత పూర్వక సమాధానంలో ఆయన ఈ విషయం తెలియజేస్తూ.... సరిహద్దులలో జరిగే నేర కార్యకలాపాలు, అక్రమ రవాణా, నేరస్తుల కదలికలు వంటి సమస్యలను సమర్ధవంతంగా పరిష్కరించడానికి కంచెలు సహాయ పడతాయని అన్నారు. భారత్ - బంగ్లా దేశ సరిహద్దులలో దాదాపు 864 కిలోమీటర్ల దూరం మాత్రమే కంచె నిర్మించావలసి ఉందని, ఇందులో 174 కిలోమీటర్లకు పైగా సాధ్యం కాని అంతరం కూడా ఉందని నిత్యానంద రాయ్ వివరించారు.

========================

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో (MGNREGS) ఉన్న వారిలో 2022-24 మధ్యకాలంలో 1.55 కోట్ల మంది కార్మికుల పేర్లను తొలగించిందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. కేంద్ర గ్రామీణాభివృద్ధి సహాయ మంత్రి కమలేశ్ పాసవాన్ లోక్‌సభలో ఈ విషయాన్ని వెల్లడించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 86 లక్షల 17 వేల 887 మంది, 2023-24లో 68 లక్షల 86 వేల 532 మంది కార్మికుల పేర్లను తొలగించినట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు. నకిలీ, తప్పుడు జాబ్ కార్డులు, గ్రామాల నుంచి కార్మికుల కుటుంబాలు తరలిపోవడం లేదా సంబంధిత గ్రామాలను పట్టణాలుగా వర్గీకరించడం తదితర అంశాలు ఇందుకు కారణంగా కమలేశ్ పాసవాన్ వెల్లడించారు.

========================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 77 వేల 186 వద్ద లాభాల్లో ప్రారంభమై.. చివరికి 1,397 పాయింట్ల లాభంతో 78 వేల 583 పాయింట్ల వద్ద ముగిసింది.

========================
========================